

# ఆత్మీయ సమ్మేళనాలు కాదు

# మీ దారెటో తేల్చండి

## మాజీ ఎంపీ పొంగులేటిపై జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు ఫైర్

**ఖమ్మం బ్యూరో, కెరటం న్యూస్**

"ఆత్మీయ సమ్మేళనాలతో సమావేశాలు ఏర్పాటుచేసి బీఆర్ఎస్‌ను, బీఆర్ఎస్ అమలుచేస్తున్న సంక్షేమాన్ని విమర్శించడం కాదు..ముందు మీ దారెటో చెప్పండి.. ఆతర్వాత మాట్లాడండి..' అని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై జడ్పీ చైర్మన్ లింగాల కమర్‌రాజు ఫైర్ అయ్యారు. ఖమ్మం ఉమ్మడి జిల్లాలో ఆత్మీయ సమ్మేళనాలు పేరుతో బీఆర్ఎస్ అభివృద్ధిని ప్రశ్నించే అధికారం ఎవరికీ లేదన్నారు. ముఖ్యంగా మధిర మునిసిపాలిటీ గెలవడం మా బిక్షేనని ప్రకటించడం సరికాదన్నారు. మధిర అసెంబ్లీ ఎన్నికల తరువాత పొంగులేటి శ్రీనివాసరెడ్డి లేకుండానే అనేక ఎన్నికల్లో అద్భుతమైన విజయాలు సాధించామని గుర్తుచేశారు. ప్రధానంగా పంచాయతీ ఎన్నికలు, ఎంపీటీసీ, జడ్పీటీసీ, సహకార సంఘం ఎన్నికలు ఇలా వార్డు ఎన్నికలు సహా ఎన్నికలు జరిగిన ప్రతిసారీ కూడా కార్యకర్తల పోరాట స్ఫూర్తితో అద్భుతమైన ఫలితాలు సాధించామన్నారు. మంత్రి అజయ్‌కుమార్ ప్రత్యేక చొరవ, కృషి, ఎంపీ నామ నాగేశ్వరరావు, బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు తాతా మధుసూదన్, మాజీ శాసనసభ్యులు కొండబాల కోటేశ్వరరావు తదితరుల అందరి కృషి పట్టుదల వల్లనే మధిర మునిసిపాలిటీ గెలుపొందామని అన్నారు.



మధిర నియజకవర్గంలో గత శాసనసభ ఎన్నికల తరువాత జరిగిన ఎంపీపీ ఎన్నికల్లో మొత్తం ఐదు మండలాలకు గాను నాలుగింటిలో బీఆర్ఎస్ విజయం సాధించిందని గుర్తుచేశారు. ఐదు జడ్పీటీసీలకు గాను నాలుగు చోట్ల విజయం సాధించినట్టు తెలిపారు. మొత్తం 131గ్రామ పంచాయతీలకు జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ సింగిల్‌గానే 61కిపైగా పంచాయతీలను గెలుచుకుందన్నారు. నియోజకవర్గంలో ఉన్న ఏకైక మునిసిపాలిటీని కూడా బీఆర్ఎస్ గెలుచుకుందన్నారు. నేనే గెలిపించాను, మధిరలో గెలవడానికి కారణం నా బిక్షేనని చెప్పుకోవడం అంటే మధిర ప్రజలను అవమాన పరిచినట్టేనని అన్నారు. ప్రజలులేనిది నాయకులు లేరని గుర్తుంచు కోవాలన్నారు. శీనన్న బ్రాండ్ పేరుతో స్మరించు కోవడం తప్ప మరేదీ లేదన్నారు. మీడియా సమావేశంలో తొలుత బీఆర్ఎస్ ఖమ్మం జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ మాట్లాడిన అనంతరం మధిర ఇంచార్జ్ జెడ్పి చైర్మన్ కమల్ రాజు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కూరాకుల నాగభూషణం, నగర మేయర్ శ్రీమతి నీరజ, రాష్ట్ర విత్తన అభివృద్ధి చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, సుడా చైర్మన్ బచ్చు విజయ్ కుమార్, నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పగడాల నాగరాజు, జిల్లా రైతు సమన్వయ అధ్యక్షులు నల్లమల వెంకటేశ్వర్లు, సిటీ సెంట్రల్ లైబ్రరీ చైర్మన్ మహమ్మద్ అష్రిఫ్, మాజీ జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఖమర్, కార్పొరేటర్లు కమర్తపు మురళి, రాపర్తి శరత్, మలిదశ తెలంగాణ ఉద్యమకారులు గుండ్లపల్లి శేషు తదితరులు పాల్గొన్నారు.

చదవండి కెరటం న్యూస్



## ప్రజా నాయకుడు

# పొంగులేటి

**మధిర, కెరటం న్యూస్**

ప్రజల ఆశీస్సులతో ప్రజాప్రతినిధిగా రాజకీయాల్లోకి వచ్చిన ప్రజా నాయకుడు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అని ప్రముఖ వైద్యులు, బీఆర్ఎస్ నాయకులు డాక్టర్ కోట రాంబాబు తెలిపారు. మంగళవారం కె.వి.ఆర్ అండ్ జనరల్ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొంగులేటి ఆత్మీయ సమ్మేళనానికి విచ్చేసిన పొంగులేటి అభిమానులకు, మధిర నియోజకవర్గ ప్రజలకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. పొంగులేటి పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను ఆయన తీవ్రంగా ఖండించారు. బీఆర్ఎస్ పార్టీలో పొంగులేటికి జరిగిన అవమానాలు, ఎదుర్కొన్న కష్టాలను ప్రజలకు వివరించి వారి అభిప్రాయాన్ని సేకరించి సరైన నిర్ణయం తీసుకునేందుకు పొంగులేటి ఈ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. వేల సంఖ్యలో పొంగులేటి అభిమానులు వచ్చి శీనన్న ఒంటరి కాదని, మేము అందరం అండగా ఉంటామని ఈ సమ్మేళనం ద్వారా చాటి చెప్పినట్లు తెలిపారు. కొంతమంది బీఆర్ఎస్ నాయకులు అవాకులు,చవాకులు పేలుతున్నారని, మతిభ్రమించి మాట్లాడుతున్నారని అన్నారు. పొంగులేటిని విమర్శించే స్థాయి ఎమ్మెల్సీ తాతా మధుకు ఎక్కడ ఉందని ప్రశ్నించారు. జిల్లాలో పార్టీ అభ్యర్థులను ప్రజాప్రతినిధులగా ఒంటి చేత్తో గెలిపించిన సత్తా పొంగులేటికి మాత్రమే ఉందన్నారు. ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటూ వారి అభిమానాన్ని చూరగొన్న పొంగులేటిపై విమర్శిస్తున్న తాత మధు రాజకీయ అవివేకని ఆరోపించారు. పొంగులేటికి బీఆర్ఎస్ వల్లే కాంట్రాక్టులు వచ్చాయని నిరాధార ఆరోపణలు చేస్తున్నారని తెలిపారు. శీనన్న గత 30 సంవత్సరాలుగా క్లాస్ వన్ కాంట్రాక్టర్ గా టిడిపి, కాంగ్రెస్ ప్రభుత్వాల హయాంలో కూడా పని చేసినట్లు తెలిపారు. బిఆర్ఎస్ లో కూడా కాంట్రాక్టులు పొందినప్పటికీ ఓపెన్ బిడ్ ద్వారా ఆయా కాంట్రాక్టులు దక్కించుకున్నారని తెలిపారు. ఒకవేళ ఓపెన్ బిడ్ లేకపోతే మీరు కమిషన్లు తీసుకొని ఆయా వర్కులు ఇచ్చినట్లు భావించాలా అని ప్రశ్నించారు. మధిర మున్సిపాలిటీని పొంగులేటి వల్లనే కైవసం చేసుకున్న విషయం అందరికీ గుర్తుందని అన్నారు. కేటీఆర్ ఆదేశాలతో వచ్చి రెబల్స్ అభ్యర్థులను తప్పించి కౌన్సిలర్లను గెలిపించేందుకు అన్ని రకాల సాయం అందించిన విషయం మీకు తెలియదా అని అన్నారు. రెబల్స్ వల్ల ఓడిపోయిన ప్రజాప్రతినిధులు పొంగులేటి పై నిందలు వేయడం సిగ్గుచేటు అన్నారు. అసలు పొంగులేటిని విమర్శించే మీరు ఏ స్థాయి నాయకులని, మీకు ఉన్న అర్హత ఏమిటని, మీరు దొడ్డి దారిన వచ్చిన నాయకుడని విమర్శించారు. పొంగులేటికి ఉన్న ప్రజాభిమానం ప్రజాక్షేత్రంలో తెలుసుకోవడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. ఎన్ఆర్ఐగా ఉండి మీరు అక్కడ ఏమి చేశారో, సిపిఎం, ప్రజారాజ్యం తదితర పార్టీల్లో పనిచేసి ఆ తర్వాత టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శిగా ఈ జిల్లాలో ఊడిపడ్డ విషయం జిల్లా ప్రజలకు తెలుసన్నారు. ఈ జిల్లాలో ఇప్పటికైనా మిమ్మలను ఎంతమంది గుర్తుపడతారని ప్రశ్నించారు. లక్షలాది గుండెలను తట్టిన గొప్ప నాయకుడని, ముంపు ప్రాంతాలకు ఆర్థిక సాయం, జిల్లా ప్రజలు కష్టాల్లో ఉంటే వారికి ఆర్థిక సాయంతో పాటు అండగా నిలుస్తున్నారని తెలిపారు. రైతుబంధు జిల్లా కమిటీ సభ్యులు మందడపు తిరుమలరావు మాట్లాడుతూ తాతా మధు వ్యవసాయ క్షేత్రంలోకి వెళితే విద్యుత్ సరఫరా ఎంత ఇస్తున్నారో తెలుసుకోవచ్చునని పేర్కొన్నారు. గ్రామాల్లో పర్యటించి డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు ఎన్ని చోట్ల కట్టించారో తెలుసుకోవడానికి రావాలని కోరారు. ఎన్టీఆర్, వైఎస్ఆర్ హయాంలో ఇళ్ళు కట్టించారని, కానీ నేడు కేసీఆర్ అందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల ఆశ కల్పించి ఇళ్లను నిర్మించలేదని తెలిపారు. రుణమాఫీ ఎంతమందికి చేశారో రైతుల సమక్షంలో విచారణ చేద్దామని సవాల్ చేశారు. ప్రత్యక్ష ఎన్నికల్లో సత్తా చాటిన ప్రజల మనిషి పొంగులేటి అని, మీకు మాదిరిగా పరోక్షంగా వచ్చిన నాయకుడు కాదని ఎమ్మెల్సీ తాత మధుని ఎద్దేవా చేశారు. అదేవిధంగా ధరణిలో ఈనామ్ భూములకు సంబంధించి అనుభవదారుల కాలంలో రైతుల పేర్లు లేవని, దీనివల్ల సన్న,చిన్నకారు రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. నిజాం పరిపాలనలో ఉన్న భూముల వివరాలు నేడు ధరణిలో కనిపించడం లేదన్నారు. ఈ విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు, పొంగులేటి అభిమానులు ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, దేవిశెట్టి రంగారావు, యన్నం కోటేశ్వరరావు, ఎర్రగుంట రమేష్, వేమిరెడ్డి లక్ష్మారెడ్డి, తూమాటి అనంతరెడ్డి, గోళ్ళ ఉద్దండు, శ్రీనివాసరావు, అక్కినపల్లి నాగేశ్వరరావు, చిలకా వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.